క్లుప్తంగా

జిల్లాలో నలుగురు సీఐలు బదిలీ

తిరుపతి క్రైమ్: జిల్లాలో నలుగురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేస్తున్న రామకృష్ణ సోషల్ మీడియా వింగ్‌కు, ఆ స్థానంలో పనిచేస్తున్న ఇమ్రాన్ బాషాకు భాకరాపేటకు బదిలీ అయ్యారు. వీఆర్‌లో ఉన్న ఉన్న సీఐలు శ్రీనివాసులు ఈస్ట్ సీఐగా, మద్దయ్య ఆచారిని తిరుమల స్పెషల్ బ్రాంచ్‌కు నియమించారు.

ప్రపంచ ఆంగ్ల దినోత్సవం


ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ

తిరుపతి సిటీ: స్థానిక ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో షేక్స్‌పియర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రపంచ ఆంగ్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఆంగ్లభాషకు, లిటరేచర్‌కు షేక్స్‌పియర్ చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ప్రొఫెసర్ బీఎల్‌వీజీ జగన్, హెచ్‌ఓడీ చంద్రయ్య, అధ్యాపకులు, పాల్గొన్నారు.

పోలీసు కుటుంబానికి ఆర్థిక సాయం


మృతురాలి కుటుంబానికి చెక్కు అందచేస్తున్న ఏఎస్పీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసుశాఖలో పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన శ్యామల కుమారి కుటుంబానికి జిల్లా పోలీసుశాఖ తరపున రూ.1.50 లక్షల ఆర్థిక సాయాన్ని బుధవారం అందచేశారు. అటాచ్‌మెంట్‌పై క్లాస్–4 ఉద్యోగిగా తిరుపతిలో పనిచేస్తూ, శ్యామలకుమారి రెండు రోజుల క్రితం మృతి చెందారు. ఈమె కుమారుడు పృథ్వికి ఐడీఆర్‌ఎఫ్ ఫండ్ నుంచి రూ.లక్ష, విడో ఫండ్ నుంచి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని చిత్తూరులోని పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు అందచేశారు.

ఘనంగా కుంభాభిషేకం


కుంభాభిషేకంలో ఎంపీపీ రెడ్డెమ్మ, చెంగల్‌రెడ్డి

భాకరాపేట : ఎర్రావారిపాళెం మండలం కమలయ్యగారిపల్లె పంచాయతీలోని పచ్చార్లవాండ్లపల్లె వైఎస్సార్ కాలనీలో శ్రీరామాలయ కుంభాభిషేక మహోత్సవం ఎంపీపీ రెడ్డెమ్మ, చెంగల్‌రెడ్డి దంపతులు శాస్త్రోక్తంగా బుధవారం నిర్వహించారు. ఎంపీపీ రెడ్డెమ్మ, చెంగల్‌రెడ్డి దంపతులు ఆలయ నిర్మాణం చేపట్టి పూజలు చేపట్టారు. గ్రామప్రజలు పెద్దఎత్తున వచ్చి శ్రీ సీతారాములు వారిని దర్శించుకున్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన

తిరుపతి తుడా: స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో వర్చువల్ పద్ధతిలో ఫిజియో సరళీకృత పరిశోధన సేవ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్చువల్ విధానంలో హాజరైన మహారాష్ట్ర ఎంపీటీ స్పోర్ట్స్ ఫౌండర్ ఆఫ్ ఫిజియోసిప్లిఫైడ్ డాక్టర్ శుభంకర్ మహేష్ వావల్ మాట్లాడుతూ ఫిజియో సింప్లిఫైడ్ అనేది ఫిజియోథెరఫీ, రీసెర్చ్‌తో సంబంధిత సేవలను అందించే సంస్థ అని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గాయిత్రి సురేష్, ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి విద్యార్థులకు పలు అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రీకుమారి, అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎంబీవైపై అవగాహన

తిరుపతి అర్బన్: ప్రధానమంత్రి మాతృ వందన యోజన(పీఎంబీవై)పథకంపై అంతా అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ పీడీ వసంతబాయి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం చిత్తూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాలకు చెందిన సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు పీఎంబీవై పథకంపై ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు.

ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల ప్రభంజనం


లహరి

చంద్రగిరి: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సత్తా చాటారు. 431 మంది విద్యార్థులకు గాను 298 మంది విద్యార్థులు 69.1శాతం ఉత్తీర్ణతతో ఉత్తమ ప్రతిభను కనబరిచినట్లు ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్ బాబు తెలిపారు. 23సీడీఆర్41–300073: మండల టాపర్‌గా నిలిచిన సంప్రీత్

టెన్త్‌లో ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల సత్తా


విద్యార్థులతో కలసి ఉపాధ్యాయ బృందం, ప్రిన్సిపల్

భాకరాపేట : ఎర్రావారిపాళెం మండలం ఆదర్శ పాఠశాల విద్యార్థులు విజయదుందుబి మోగించినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీదేవి తెలిపారు. 76 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా ప్రథమ స్థానంలో జ్ఞానేశ్వర్ 587 మార్కులు, ద్వితీయ స్థానంలో ఉదయశ్రీ 582 మార్కులు, తృతీయ స్థానంలో రోషణ 574 మార్కులు సాధించాలరన్నారు. అలాగే 500 మార్కులకు పైన 14 మంది విద్యార్థులు, ప్రథమ శ్రేణిలో 62 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

పాకాలలో 47 శాతం ఉత్తీర్ణత


డి.స్నేహశ్రీ నవమన్‌అలీ సి.లక్ష్మీప్రసన్న

పాకాల : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఉత్తీర్ణత 47 శాతమని ఎంఈఓ బాబ్జి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 6 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 355 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, అందులో 166 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

రామచంద్రాపురంలో 85.2 శాతం

తిరుపతి రూరల్ (రామచంద్రాపురం) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రామచంద్రాపురం విద్యార్థులు 85.2 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు తెలిపారు. బుధవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మండలంలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

తిరుపతి రూరల్ మండలంలో..


రామచంద్రాపురంలో విద్యార్థులతో కేక్ కట్ చేయిస్తున్న ఎంఈఓ

తిరుపతి రూరల్ మండలంలోని 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 344మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందులో 203మంది ఉత్తీర్ణులయ్యారు.

టెన్త్ ఫలితాల్లో కార్పొరేట్ స్కూళ్ల హవా

తిరుపతి నగరంలోని కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులు టెన్త్ పలితాల్లో హవా కొనసాగించారు. పోటాపోటీగా మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయా కళాశాలల యాజమాన్యాలు అభినందించాయి.

స్ప్రింగ్ డేల్ స్కూల్‌లో..


అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న స్ప్రింగ్‌డేల్ ప్రిన్సిపల్ అనూరాధ

తిరుపతి మంగళం : తిరుపతి–కరకంబాడి మార్గంలో ఉన్న స్ప్రింగ్ డేల్ స్కూల్ 80 మంది టెన్త్ పరీక్షలు పరీక్షలు రాయగా.. టి.లావణ్య, పి.రమ్య 600 మార్కులకు గానూ 590 అత్యుత్తమ మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ అనూరాధ తెలిపారు. అలాగే 580కి పైగా మార్కులు పదిమంది, 550కు పైగా 36మంది మార్కులు సాధించారన్నారు. వీరిని హెచ్‌ఎం ప్రమీల కృష్ణన్, ఏఓ చంద్రశేఖర్, పీఆర్‌ఓ సాంబశివారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రత్నం విద్యార్థుల విజయకేతనం


ఉత్తమ మార్కులు సాధించిన రత్నం విద్యాసంస్థ విద్యార్థులు

పదో తరగతి ఫలితాల్లో తిరుపతి రత్నం విద్యాసంస్థల విద్యార్థులు గిరివర్ధన్ 590, నేహస్రి 587, సాహితి 586, జాగృతి 583, కుషల్‌కుమార్‌రెడ్డి, విఖ్యాత్ 581 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థ ప్రిన్సిపల్స్ పురుషోత్తమ రెడ్డి, రవి, మేనేజర్ వంశీకృష్ణ అభినందించారు.

ఎస్‌ఎం హైస్కూల్‌లో..


విద్యార్థినికి రూ.10వేలు నగదు అందజేస్తున్న ఎస్‌ఎం స్కూల్ కరస్పాండెంట్ బాషా

తిరుపతి ఎడ్యుకేషన్ : నగరంలోని వెంకటరమణ లేఅవుట్‌లోని ఎస్‌ఎం హైస్కూల్ విద్యార్థులు పి.అర్షియా 593, సీఎస్ సౌమ్యశ్రీమణి 568, ఎస్.టిప్పు ఖాదిరి 546 మార్కులు టెన్త్‌లో సాధించినట్లు కరస్పాండెంట్ ఎస్‌ఎం బాషా తెలిపారు. అనంతరం 593 మార్కులు సాధించిన పి.అర్షియాకు రూ.10వేలు నగదు ప్రోత్సాహక బహుమతి అందజేశారు.

పది ఫలితాల్లో మాతృశ్రీ ప్రభంజనం


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో మాతృశ్రీ పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్‌నాయుడు

తిరుపతి రైల్వేకాలనీలోని మాతృశ్రీ పాఠశాల విద్యార్థులు టెన్త్‌లో ఎం.రెడ్డిసాయి నాయుడు 588, ఎస్.పవన్ 587, కె.లక్ష్మీజ్ఞానాక్షాయ 584, జి.కార్తిక్ 581, ఎ.శ్రీజ 580 మార్కులు సాధించారని, అలాగే వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ కె.సుధాకర్‌నాయుడు తెలిపారు. అనంతరం విద్యార్థులను ఆయన అభినందించారు.

నలంద స్కూల్‌లో..

నగరంలోని నలంద పాఠశాల విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో కె.జ్యోష్ణ 581, పి.చతురారెడ్డి 575, డి.ప్రణతి 562, జి.స్నేహ 557, కె.డింపుప్రియ 550మార్కులు సాధించారు. అనంతరం వీరిని పాఠశాల కరస్పాండెంట్ ఓబుల వెంకటరమణారెడ్డి, డైరెక్టర్ ఓబుల ఆనందరెడ్డి అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న నలంద పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్

సెవెన్‌హిల్స్ స్కూల్‌లో


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో సెవెన్ హిల్స్ స్కూల్ కరస్పాండెంట్

నగరంలోని సెవెన్‌హిల్స్ హైస్కూల్ విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ ఎం.హరనాథశర్మ, హెచ్‌ఎం హేమలత అభినందించారు.

శ్రీచైతన్య స్కూల్‌లో..


ఉత్తమ మార్కులు సాధించిన శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు

తిరుపతి శ్రీచైతన్య విద్యాసంస్థ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారని ఏజీఎం సురేష్ తెలిపారు. తమ విద్యార్థులు ఆర్.సంషితా రెడ్డి 597, టి.రితిక్ రోషిని, కె.బృంద 596, ఎస్.శరణ్య, జి.సాయిమోక్షజ్ఞ, కె.లాస్య 595, పి.సాయిలేఖన, ఎం.త్రిశాంక్, పి.ఇందుప్రియ, ఎస్.వెంకటపవన్, జి.చార్వి, డిజి.స్నేహిత, కుశల్ వర్ష, హర్షిత, సాహిత్య 594 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

కిరణ్ స్కూల్‌లో..


విద్యార్థులను అభినందిస్తున్న కిరణ్ స్కూల్ అధినేత జయరామిరెడ్డి

పది ఫలితాల్లో తిరుపతి ఎస్వీ నగర్‌లోని కిరణ్ స్కూల్ విద్యార్థులు టి.మనోజ్ 584, సీఎస్.కీర్తి 581, సి.దుర్గాసాయి తేజు 576, ఎస్.రిస్మిత 575, కె.అర్చనారెడ్డి 573, ఎ.బేబీశ్రావణి 572, కె.హేమంత్ 570 మార్కులు సాధించారు. వీరిని పాఠశాల అధినేత జయరామిరెడ్డి అభినందించారు.

అకడమిక్ హైట్స్‌లో..


విద్యార్థులను అభినందిస్తున్న హిమసాగర్

నగరంలోని అకడమిక్ హైట్స్ విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో ఎస్.సుష్మిత592, పి.సుహానా591, కె.జాస్మిత 584 మార్కులు సాధించారు. వీరిని పాఠశాల డైరెక్టర్ ఎం.హిమసాగర్, హెచ్‌ఎం.మురళీకృష్ణ అభినందించారు.

గీతం స్కూల్‌లో..

తిరుపతిలోని గీతం పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఎస్.అచ్యుత్‌కుమార్ స్వామి 589, ఎస్.రేణుక 584 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ తమ్మినేని వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ కిన్నెర శ్రీదేవి తెలిపారు. అనంతరం వీరిని అభినందించారు.


ఉత్తమ మార్కులు సాధించిన గీతం విద్యార్థులు

ప్రసన్నభారతి స్కూల్‌లో..


విద్యార్థులను అభినందిస్తున్న ఈశ్వరయ్య

కొర్లగుంటలోని ప్రసన్నభారతి పాఠశాల విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో టి.లిఖితసాయి 586, ఎస్.శివప్రసాద్ 583, ఓ.యోగిత 579మార్కులు సాధించినట్లు పాఠశాల వ్యవస్థాపకులు కె.ఈశ్వరయ్య తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

భాష్యం స్కూల్‌లో..


ఉత్తమ ఫలితాలు సాధించిన భాష్యం విద్యార్థులు

ధనలక్ష్మినగర్‌లోని భాష్యం హైస్కూల్ విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో కె.చరణ్(590), కె.లాస్యప్రియ(587), యామిని, పి.అఖిల్(582), దుర్బీ, స్వరూప్(580) అత్యుత్తమ మార్కులు సాధించారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను తిరుపతి జోనల్ ఇన్‌చార్జ్ లక్ష్మణ్, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, బాలాజీ అభినందించారు.

కేశవరెడ్డి స్కూల్‌లో..


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో కేశవరెడ్డి స్కూల్ ప్రిన్సిపల్

తిరుపతి కేశవరెడ్డి పాఠశాల విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో భానుతేజేష్ 595, మానిక, రేష్మశ్రీ 594, భవిష్యారెడ్డి, తేజస్విని, షష్మిక 592, షణ్ముఖ ప్రియ, దినేష్ 591, రెడ్డి నాగజస్వంత్ 590మార్కులు సాధించారు. వీరిని ఆ పాఠశాల ప్రిన్సిపల్ అభినందించారు.

రెడ్‌చెర్రీస్ స్కూల్‌లో..


విద్యార్థులతో రెడ్‌చెర్రీస్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి

తిరుపతిలోని రెడ్‌చెర్రీస్ పాఠశాల విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో టి.మోక్షప్రియ 596, ఎ.డోలాశ్రీ దుర్గ 594, ఎ.రితన్య, బీవీ నిషాంత్ 593 మార్కులు సాధించారు. వీరిని పాఠశాల డైరెక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి అభినందించారు.

కేంబ్రిడ్జి స్కూల్‌లో..


పి.మనస్విత, పి.లక్షణవ్యాస్, పి.తన్వీ

తిరుపతి బాలాజీకాలనీలోని కేంబ్రిడ్జి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటారు. పి.మనస్విత, పి.లక్షణవ్యాస్, పి.తన్వీ 583 మార్కులు సాధించగా పాఠశాల కరస్పాండెంట్ కల్పన అభినందించారు.

ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య


క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుపతి సిటీ/తిరుపతి గాంధీ రోడ్: జమ్మూ కాశ్మీర్లోని పహల్గామ్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాద దాడిని అఖిల భారతీయ రాష్ట్రీయ శిక్షక్ మహాసంఘ్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలసుబ్రమణ్యం తెలిపారు. తిరుపతి నాలుగుకాళ్ల మండపం వద్ద బీజేపీ నేతలు, ఎస్వీయూలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: జమ్ముకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి పిరికిపంద చర్య అని బీజేపీ, జనసేన నాయకులు అన్నారు. దాడిని నిరసిస్తూ బుధవారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద వేర్వేరుగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించి మృతుల కుటుంబాలకు నివాళులర్పించారు. ఉగ్రమూకలపై ప్రతీకారం తప్పదన్నారు.

సందర్శకులపై ఉగ్ర దాడి అమానుషం

తిరుపతి కల్చరల్: అన్యాయంగా 28 మంది సందర్శకులపై ఉగ్రవాదులు దాడి చేసి వారిని పొట్టన పెట్టుకోవడం అమానుషమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వందవాసి నాగరాజు తెలిపారు. ఉగ్రవాదుల దాడికి నిరసనగా వేమన విజ్ఞాన కేంద్రం నుంచి సుందరయ్యనగర్ కమ్యూనిటీ హాల్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు.

దళితుడిపై దాడి దారుణం

తిరుపతి సిటీ: ఏర్పేడు మండలం ముసలిపేడు గ్రామానికి చెందిన తోకల సురేష్ అనే దళితుడిపై రేణిగుంట మండలం కృష్ణాపురం దళితవాడ సమీపంలో ఆదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు హఠాత్తుగా మారణాయుధాలతో దాడి చేశారని బాధితుడి భార్య రాజేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ తాము సామాజిక చైతన్య వేదిక సంస్థలో పని చేస్తూ జీవనం గడుపుతున్నామని తెలిపారు. ఈనెల 18వ తేదీన రేణిగుంట మండలం కృష్ణాపురం దళితవాడకు చెందిన సుబ్రహ్మణ్యం భార్య సుగుణ పిలుపు మేరకు తన భర్త తోకల సురేష్ రేణిగుంటకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన ముద్దరాయులు, అతని కుమారులు మరో 10 మందితో వచ్చి సుగుణ కారును ధ్వంసం చేశారన్నారు. అందులో నుంచి బ్యాగ్ తీసుకెళ్తుండగా తన భర్తను ఎందుకు ఇలా చేస్తున్నారని ప్రశ్నించడంతో దాడి చేస్తూ కులం పేరుతో దూషించినట్లు పేర్కొన్నారు. దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు డిప్యూటీ కమిషనర్ అమరయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్ ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, డిప్యూటి డీఎంహెచ్‌ఓ డాక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

వేడుకగా ధ్యానచంద్ విగ్రహావిష్కరణ


ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు సమర్పిస్తున్న అతిథులు, క్రీడారంగ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఒలిపింక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ బహూకరించిన హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని బుధవారం శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, శాప్ చైర్మన్ రవి నాయుడు, కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

ఆటోనగర్‌కు విముక్తి కల్పించండి


మంత్రి శ్రీనివాస్‌ను కోరుతున్న దేవేంద్రరెడ్డి

తిరుపతి మంగళం : మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చేతుల మీదుగా 25 సంవత్సరాల క్రితం ఏర్పాటైన తిరుపతి ఆటోనగర్‌ను నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించాలని ఫ్యాప్సియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవేంద్రరెడ్డి కోరారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసులుకు ఆయన వినతిపత్రం అందజేశారు. సేల్ డీడ్ ఆటోనగర్‌లోని అప్పటి ఎన్టీఆర్ ప్రభుత్వం కేటాయించిందని, గత టీడీపీ ప్రభుత్వంలోనే సదరు భూమిని 22ఏ జాబితాలోకి చేర్చిందని తెలిపారు. ఏడేళ్లుగా 22ఏ జాబితా నుంచి ఆటోనగర్‌ను మినహాయించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఒక్క ఆటోనగరే కాకుండా తిరుపతి జిల్లా పరిధిలోని పారిశ్రామికవాడల్లోని భూములు 22ఏ జాబితాల్లో ఉండడం వల్ల బ్యాంకుల నుంచి రుణాలు పొందలేక మెకానిక్‌లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూటమి పాలనలో అయినా పారిశ్రామికవాడల్లోని భూములకు 22ఏ జాబితాల నుంచి విముక్తి కల్పించాలని కోరారు.

చెరువుల సుందరీకరణ పనులపై సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: తిరుపతి చెరువుల సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన బుధవారం జేసీ శుభం బన్సల్‌తో పాటు ఆర్డీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వనరులను అభివృద్ధి చేయడానికి ట్యాంకుల పునరుద్ధరించడానికి సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ముఖ్యంగా దామినేడు, పేరూరు, అవిలాల రామక్క చెరువు, తూకివాకం, వెంకటాపురం, వెలమండ్యం వినాయక సాగర్, పాన్ చెరువు, గొల్లవానిగుంట, కొరమేనుగుంట చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తిరుపతి ఆర్డీఓ రామమోహన్, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం సేవలు అభినందనీయం



తిరుపతి కల్చరల్: రాష్ట్రీయ సేవాసమితి, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారు వివిధ వర్గాల వారికి అందిస్తున్న సేవలు అభినందనీయమని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్) డెప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజ్బీర్‌సింగ్ తెలిపారు. ఒకరోజు అధికార పర్యటనలో భాగంగా బుధవారం ఆయన రాస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఆయనకు రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం వివిధ వర్గాల వారికి రాస్ ద్వారా 40 ఏళ్లుగా అందిస్తున్న సేవల గురించి ఫొటో ప్రదర్శన ద్వారా వివరించారు.